వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూన్ 24: కొత్తపేట ఎమ్మెల్యేగా భారీమెజార్టీతో విజయం సాధించిన బండారు సత్యానందరావు శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం కుటుంబ సభ్యులతోపాటు సోదరుడు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పెద్ద కుమారుడు సందీప్ తలనీలాలు సమర్పించారు. కూటమి అభ్యర్థిగా సత్యానందరావు పేరు ఖరారైనప్పటి నుంచి ఆయన సోదరుడు కూడా పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు అన్నతో కలిసిమెలిసి విజయానికి కృషిచేశారు. ప్రమాణస్వీకారం చేశాక తొలిసారిగా కొత్తపేట నియోజకవర్గానికి మంగళవారం ఉదయం చేరుకుంటారు. ఎటువంటి ఊరేగింపులు నిర్వహించొద్దని బండారు పార్టీ శ్రేణులకు ముందుగానే తెలియజేశారు. అభిమానులు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. కాగా వాడపాలెంలో బండారు అందుబాటులో ఉంటారు.


కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే బండారు


దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం


గంటి హరీష్ మాధుర్ బాలయోగి, అమలాపురం


తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ






ముగ్గురు ఎంపీలు ప్రమాణం

తెలుగులో పురందేశ్వరి.. ఇంగ్లీష్‌లో హరీష్, ఉదయ్

రాజమహేంద్రవరం అర్బన్/అమలాపురం/కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 24 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు కూటమి పార్లమెంట్ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి అనే నేను అంటూ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ముగించారు. అమలాపురం రిజర్వు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన గంటి హరీష్ బాలయోగి ఆంగ్లంలో ప్రమాణపత్రాన్ని చదివారు. ప్రమాణ స్వీకారం అనంతరం హరీష్ ప్రొటెం స్పీకర్‌ను కలిశారు. పార్లమెంటులో టీడీపీ విప్‌గా ఇప్పటికే నియమితులైన హరీష్ చాంబర్‌లో కొలువుదీరారు. కాకినాడ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇంగ్లీష్‌లో ప్రమాణ పత్రాన్ని చదివారు. తొలిసారి ఎంపీలుగా గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికవడం గమనార్హం. రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. టీడీపీ ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన కోనసీమ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తానన్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేస్తానని, కాకినాడ సరికొత్త అభివృద్ధి పథకాలతో వెలుగుతుందని చెప్పారు.







స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ

జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

మామిడికుదురు, జూన్ 24: జిల్లాలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని పాశర్లపూడి, ఈదరాడ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు. లోపాలు తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 840 ఓహెచ్ఎస్ఆర్‌లు ఉన్నాయని, వాటిని ప్రతి 15 రోజులకోకసారి శుభ్రపరచాలని ఆదేశాలిచ్చామన్నారు. శుభ్రపరిచే విధానాన్ని ఫొటోలు తీయాలన్నారు. దీనికి గాను ఒక యాప్ రూపొందిస్తున్నామని, అది 15 రోజుల్లో అందుబాటులో ఉంటుందన్నారు. తాగునీటిని పంపిణీ చేసే పైపులైను లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో డయేరియా విజృంభిస్తున్నందున గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఎబేట్, బ్లీచింగ్ మందులను పిచికారీ చేయాలని, గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని పంచాయతీలకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. సిబ్బంది ఆయా కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలనలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ సురేష్‌బాబు, ఏఈ జయశ్రీ, మండల పరిషత్ కార్యాలయ ఏవో కె.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎ.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు పాల్గొన్నారు.

కేకేను సత్కరించిన అనిల్



ఆత్రేయపురం, జూన్ 24: మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన తెలుగు యువతనాయకుడు వెచ్చా అనిల్ బండారు సత్యానందరావు విజయం కోసం పాటుపడ్డారు. రాష్ట్రంలో కూటమికి చారిత్రక విజయం లభిస్తుందని కేకే సర్వే తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటిని అనిల్‌కుమార్ కలిసి దుశ్శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు నాయకత్వంలో బండారు విజయం కోసం అనిల్ ఎంతగానో పాటుపడ్డారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.96 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామికి సోమవారం వివిధ సేవల ద్వారా రూ.2,96,579 ఆదాయం లభించిందని ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.











ఎమ్మెల్యే గోరంట్లకి టీడీపీ నాయకుల సత్కారం

రాజోలు, జూన్ 24: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని డెల్టా కమిటీ మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వర రాజువర్మ, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, టీడీపీ రాజోలు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బత్తుల రాము, తాటిపాక గ్రామ సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, మాజీ సర్పంచ్ అనుచూరి పురుషోత్తం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాలు కప్పి పుష్పమాలలతో సన్మానించారు. గోరంట్లను కలిసిన వారిలో చింతా వీరభద్రేశ్వరరావు, గెడ్డం సింహ ఉన్నారు.















'బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి'

ఆత్రేయపురం, జూన్ 24: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఆత్రేయపురంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. ఏఎల్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ డి.రమేష్ మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు సర్వే ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంఈవోలు ప్రసాదరావు, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా రెండోసారి 'కాళ్లకూరి'

మండపేట, జూన్ 24: మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కాళ్లకూరి గొల్లబాబు రెండోసారి ఎన్నికయ్యారు. చాంబర్ ప్రతినిధి నారాయణరెడ్డి సారథ్యంలో జరిగిన ఎన్నికకు పట్టణంలోని 34 ట్రేడ్ యూనియన్ల నాయకులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గొల్లబాబు చెప్పారు. గొల్లబాబును మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్వరరావు, వ్యాపారులు అభినందించారు.

విద్యాభివృద్ధికి ఏడు వారాల ప్రోగ్రాం దోహదం

కపిలేశ్వరపురం, జూన్ 24: 'పూరి పడాయి దేశ్‌కి భలాయి' ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో సెకండరీ విద్యకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి వారి విద్యాభివృద్ధికి ఏడు వారాల కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఎంపీడీవో కొండలరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో క్రై సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్‌రాబర్ట్ పిలుపుమేరకు ఏడు వారాల క్యాంపెయిన్‌ను ఆయన ప్రారంభించారు. చదువులో బాలికలు ముందుకు సాగడానికి, ఆటంకం కలిగిస్తున్న అడ్డంకుల గురించి క్రై సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్ వివరించారు.



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆంధ్రజ్యోతి
మంగళవారం 25 జూన్ 2024 | 7

ఎస్పీకి 14 ప్రజా ఫిర్యాదులు

అమలాపురం టౌన్, జూన్ 24: చట్ట పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 14 అర్జీలు స్వీకరించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సివిల్ వివాదాలు 3, ఇతర సమస్యలకు సంబంధించి 6, కుటుంబ కలహాలు 5 ఫిర్యాదులు అందాయన్నారు.

ఎన్నికలయ్యాక.. తొలిసారిగా..
ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 125 అర్జీలు



కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకుల నుంచి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, జూన్ 24: సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పేరిట అర్జీల స్వీకరణ చేపట్టారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అర్జీలను స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తూ అర్జీదారుల్లో విశ్వసనీయత పెంపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తమ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులను సేకరించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సకాలంలో పరిష్కార మార్గాలు చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ అనేది సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ అన్నారు. ప్రజలు తమ సమస్యను అధికారులకు అందించిన వెంటనే ఆన్‌లైన్ చేస్తారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పౌర-స్నేహపూర్వక మాడ్యూల్ అన్నారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారుడు తమ సమస్య పరిష్కార పురోగతిని తెలుసుకునే వెసులుబాటు ఆన్‌లైన్‌లో కల్పించామన్నారు. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి ఎ.బోసుబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా పౌరసరఫరల మేనేజర్ డీవీఎస్ యల్లారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, డీఈవో ఎం.కమలకుమారి, డీపీవో డి. రాంబాబు, డీఎఫ్‌వో ఎంవీ ప్రసాదరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి..

డ్రెయిన్ల పూడికతీత పనులు నిరంతర ప్రక్రియగా చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ది కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, చిక్కం పెద్దబ్బులు, ఎ.సత్యనారాయణల ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు సమస్యతో రైతులు ఖరీఫ్‌పంటను నష్టపోవాల్సి వస్తోందని, సాగునీటి కాల్వలు, బోదెలు యుద్ధ ప్రాతిపదికన బాగుచేసి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు.

వేదాంత కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని..

ఎస్.యానాంలోని వేదాంత ఆయిల్ కంపెనీలో యాజమాన్యం ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందించారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి 29 వరకు నిరుద్యోగులు చమురు సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించగా, అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్, ఉన్నతాధికారుల సమక్షంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏడాదికి 75 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించి ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, నిరుద్యోగ సంఘ నేతలు ఉండ్రు శామ్యూల్, పలచోళ్ల సుబ్బరాజు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించాలి : కౌలు రైతుల నిరసన

గత సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అర్జీ అందజేశారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు దాటిపోయినా ఇంతవరకు బకాయిలను విడుదల చేయలేదని, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితుల్లో కౌలు రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని డిమాండు చేశారు. ఆయా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, అప్పారి వెంకటేశ్వరరావు, పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, పొలమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో సెప్టిక్ వ్యర్థాలను అరికట్టాలి : ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు

జిల్లాలోని ప్రధాన పంట కాల్వల్లో ఎక్కడికక్కడ సెప్టిక్ వ్యర్థాలను విడిచి పెడుతున్నారని, దీనివల్ల ప్రజారోగ్యం పూర్తిగా దెబ్బతింటోందని ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు అడ్డాల గోపాలకృష్ణ, ఆకెళ్ల బుజ్జి, నంద్యాల ఈశ్వర్, కొత్తపల్లి వంశీలు కలెక్టర్‌కు అర్జీ అందించారు. కాల్వల్లో సెప్టిక్ వ్యర్థాలను అరికట్టి డయేరియా వంటివి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లోని 45 నుంచి 50 ట్యాంకుల ద్వారా సెప్టిక్ వ్యర్థాలను పంటకాల్వల్లో విడిచి పెడుతున్నారన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది: మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

పి.గన్నవరం, జూన్ 24: సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో సుభిక్షంగా ఉంటుందని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విజయోత్సవ సభకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కూటమి నాయకులు సన్మానించారు. తొలుత నియోజకవర్గ ముఖద్వారమైన గంటి పెదపూడి నుంచి ప్రత్యేక వాహనంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు నామన రాంబాబు, పలువురు కూటమి నేతలు ర్యాలీగా బయల్దేరి పి.గన్నవరం మూడు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా విజయోత్సవ సభా స్థలికి చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, నియోజకవర్గ కన్వీనర్ చీకరమిల్లి వెంకటేశ్వర రావు, టీడీపీ నియోజ కవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, నియోజ కవర్గ సహ కన్వీనర్ మోకా ఆనందసాగర్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన జిల్లా నాయకులు మద్దా చంటిబాబు, శిరిగినీడి వెంకటేశ్వర రావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సంసాని పెద్దిరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తొలేటి సత్తిబాబు, సాధ నాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాస రాజా, మద్దాల సుబ్ర హ్మణ్యం, గణపతి వీరరాఘవులు, మట్టపర్తి రామకృష్ణ, సలాది పుల్లయ్య నాయుడు, గంగుమళ్ల కాశీఅన్న పూర్ణ, బొంతు పెదబాబు, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 24: రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్‌కు మూడు అర్జీలు వచ్చినట్టు ఆర్డీవో ఎస్.సుధాసాగర్ తెలిపారు. అక్రమ నిర్మాణం తొలగించాలని, డి-ఫారం పట్టా ఇప్పించాలని, ఎండీయు ఆపరేటర్ సమస్య పరిష్కరించాలని అర్జీలు అందాయి.

ఉపాధి కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేయడంపై హర్షం

అంతర్వేది, జూన్ 24: ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేయడానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించడం అభినందనీయమని సఖినేటిపల్లి మండల ఉపాధి కూలీల సంఘం హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని పవన్‌కల్యాణ్‌ను కోరారు. మోరిపోడు గ్రామంలో ఉపాధికూలీల సంఘ సమావేశంలో భాగంగా ఉపాధి పని చేసిన పదిహేను రోజులకే వేతనాలు చెల్లించకుండా గత ప్రభుత్వం ఉదాసీన వైఖరితో వ్యవహరించిందని ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి స్పందించి వేతనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం ద్వారా ఉపాధిక కూలీలు కోరారు. కార్యక్రమంలో ఉపాధి మేట్ గెడ్డం దేవి, లంకే తాతరాజు, కుసుమ రమేష్, చెల్లుబోయిన శ్రీనివాస్, బొమ్మిడి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజోలు, జూన్ 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా సమన్వయకర్త జి.వెంకట్రావు, ప్రిన్సిపల్ జి.లలితకుమారి సోమవారం తెలిపారు. ముందుగా గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకుని 27వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో శిలాఫలకం ధ్వంసం

అంబాజీపేట, జూన్ 24: మండలంలోని కె.పెదపూడి ఎంపీపీ పాఠశాల ఆధునికీకరణ పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ మేరకు హెచ్‌ఎం గంటా రజనీప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు హాజరై విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలోగోడపై ఉన్న శిలాఫలకం ధ్వంసం కావడాన్ని గుర్తించి ఎంఈవోకు విషయాన్ని వివరించారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు హెచ్‌ఎం తెలిపారు.



ఎస్ఐ పరదేశికి ఎస్పీ ప్రశంస

కపిలేశ్వరపురం, జూన్ 24: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా పనిచేసినందుకు అంగర ఎస్ఐ ఎ.పరదేశికి ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఎస్ఐను పలువురు ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు అభినందించారు.

ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పరదేశి

యువతలో నైతిక విలువల పెంపునకు కృషి

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 24: యువత వ్యసనాలకు బానిసలు కాకుండా నైతిక విలువలు పెంపొందించేందుకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐవో) పలు కార్యక్రమాలు చేపడుతోందని సంస్థ రాష్ట్ర సలహామండలి సభ్యుడు జాఫర్ షరీఫ్,నగర అధ్యక్షుడు ఆసిఫ్ అహ్మద్ అన్నారు. నెహ్రూనగర్ బిలాల్ మసీదులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత, లక్ష్యరహిత జీవితంతో నైతిక పతనానికి లోనై, ఉన్నతమైన జీవిత లక్ష్యాలను విస్మరిస్తున్నారన్నారు. ఇటువంటి యువతలో మానసిక స్థైర్యం నింపడానికి సామాజిక అభివృద్ధి పేరుతో జూలై 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తు న్నామ న్నారు. రాజమండ్రి శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి అమాన్, మీడియా కార్యదర్శి ఉమర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఆహారం విక్రయం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు

రాజమహేంద్రవరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా క్యాటరింగ్ సర్వీసు పేరుతో రైళ్లలోని ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న వారిని రైల్వే కమర్షియల్ విభాగంలోని క్యాటరింగ్ బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ డివిజన్‌లో వాట్సప్ ద్వారా ఆర్డర్లు స్వీకరించి ప్రయాణికులకు ఆహారం అందజేస్తుండడం తమ దృష్టికి వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో స్ట్రింగ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఆన్‌లైన్‌లో తమ అధికారులు ఆర్డర్ చేశారన్నారు. దాని ప్రకారం రైలు నెం.12717 రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కి రాజమండ్రిలో ఫుడ్ తీసుకొచ్చిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించామని చెప్పారు. వారిపై రైల్వే యాక్టు-1989లోని సెక్షన్ 144(1) ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

బిక్కవోలు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

బిక్కవోలు, జూన్ 24: బిక్కవోలు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌చౌదరి, కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా బులిస్వామిరెడ్డి, సహకోశాధికారిగా పోలరాజులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అభినందించారు.

28న ఆర్టీసీ అన్‌ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 24: రాజమహేంద్రవరం ఆర్టీసీ పార్శిల్ ఆఫీస్‌లో అన్ ఐడెంటిఫైడ్/అన్ క్లైయిమ్డ్ పార్శిల్స్‌ను ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ కార్గో ఏటీఎం కె.మాధవ్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని కోరారు.

'పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి'

అల్లవరం, జూన్ 24: వర్షాకాలంలో డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని డీఎల్పీవో బి.వీరాస్వామి కోరారు. సోమవారం ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిపి అల్లవరం, గోడిలంక గ్రామాల్లో పర్యటించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయుట, ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు లీకేజీలను అరికట్టాలన్నారు. ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు ఎస్.రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ మంచినీటి ట్యాంకుల శుభ్రత

అంతర్వేది, జూన్ 24: కలెక్టర్ ఆదేశాల మేరకు సఖినేటిపల్లి మండలం వీవీ మెరక గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల సామర్థ్యం, ట్యాంకుల చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతను ఎంపీడీవో వీవీ సత్యనారాయణ, కార్యదర్శి ఎన్ఆర్కే రాజు సోమవారం పరిశీలించారు. వారి వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గంగరాజు, సీహెచ్ అనూష, పంచాయతీ సిబ్బంది, మంచినీటి ట్యాంకుల ఆపరేటర్లు పాల్గొన్నారు.

జంతువులకూ ప్రత్యేక హక్కులు

అమలాపురం టౌన్, జూన్ 24: మనుషుల్లాగే జంతువులకు కూడా ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి పేర్కొన్నారు. క్రీడల కోసం జంతువులను చంపడం, వినోదం కోసం జంతువులను ఉపయోగించడం, వాటిపై ఎక్కువ బరువులు వేసి మోయించడం, కోళ్లు, పక్షులను తలకిందులుగా వేలాడదీసి తీసుకువెళ్లడం నేరమని వివరించారు. పేరూరులోని ప్రతిభ జూనియర్ కళాశాలలో సోమవారం జంతు హక్కులపై పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు గోవధ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఎక్కడపడితే అక్కడ పశువులను వధించడం, పశు మాంసాన్ని విక్రయించడం నేరమన్నారు. గోవధ, అక్రమ రవాణా చేస్తుంటే అటువంటి వారిని అడ్డుకుని పోలీసులకు అప్పగించి పౌరులకు సామాజిక బాధ్యత కల్పించారన్నారు. ఒక లారీలో ఆరు పశువుల కంటే ఎక్కువ రవాణా చేయరాదన్నారు. డాక్టర్ హెబ్సిబా, డాక్టర్ వాసవి పాల్గొన్నారు.

కొర్లపాటివారిపాలెంలో అగ్నిప్రమాదం

రూ.8 లక్షల ఆస్తి నష్టం

అంబాజీపేట, జూన్ 24: మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటివారిపాలెంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్డు దగ్ధం కాగా రూ.8 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో గంధం రాముకు చెందిన షెడ్డు అగ్నికి ఆహుతైంది. గృహోపకరణాలతో పాటు ఇంట్లో ఉన్న బంగారం, రూ.50వేల నగదు దగ్ధమయ్యాయి. ఎదురుగా ఉన్న గొల్లపల్లి రాజేశ్వరరావుకు చెందిన గృహోపకరణ వస్తువులు, విద్యుత్ బోర్డులు కాలిబూడిదయ్యాయి. రాముకు రూ.5 లక్షలు, రాజేశ్వరరావుకు రూ.3 లక్షలు నష్టం వాటిల్లింది. అగ్నిమాపకాధికారి కేవీఎం కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం, జూన్ 24: మండలంలో 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ బి.వెంకటేశ్వరరావు కోరారు.

రేపు టీడీపీ కూటమి విజయోత్సవ సభ

అల్లవరం, జూన్ 24: అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో బుధవారం జరిగే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయోత్సవ సభను, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పుట్టినరోజు వేడుకను జయప్రదం చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో చింతా శ్రీనివాస్, చికిలే చిట్టిబాబు, శిరంగు సత్యనారాయణ, పిండి గణపయ్య, కంకిపాటి వీరబాబు, కొల్లు విష్ణుమూర్తి, ఎం.శ్రీరామ్, పోలిశెట్టి బాబులు, గుర్రం కృష్ణ, రోళ్ల శ్రీనివాస్, కాకిలేటి సూరిబాబు, పిల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులు అంతంతమాత్రమే

వెలవెలబోయిన గ్రీవెన్స్

ఆలమూరు, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అధికారులు లేక వెలవెలబోయింది. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇరవైకి పైగా ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనవలసి ఉండగా కేవలం తొమ్మిది శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో కొందరు దిగువ స్థాయి సిబ్బంది కూడా ఉన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొంటే ఫిర్యాదుదారులు వస్తారని పలువురు నాయకులు వ్యాఖ్యానించారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 24: పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో ముత్యాలమ్మ సంబరం యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, గారడీ, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

టిడ్కో సముదాయం పరిశీలన

మండపేట, జూన్ 24: పట్టణంలోని 20వ వార్డులో వున్న టిడ్కో గృహాల సముదాయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కమిషనరు బి.రాము సోమవారం పరిశీలించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, డీఈఈ శ్రీనివాస్, టిడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

28న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 24: ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాస్తున్న అన్ని ట్రేడ్ల విద్యార్థులకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 28న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఐటీసీ లిమిటెడ్ మెదక్, ఏపీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, లైఫ్ మెకానిక్స్ హైదరాబాద్, రానే బ్రేక్ లివింగ్ లిమిటెడ్ హైదరాబాద్, అరవిందో ఫార్మా తుని కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. 600 ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. విద్యార్థులందరూ తమ బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

జనసేన గెలుపుతో మొక్కు తీర్చుకున్న వీర మహిళలు



పి.గన్నవరం, జూన్ 24: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్, పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ విజయం సాధిస్తే వీరేశ్వరస్వామికి 108 కొబ్బరి కాయలు కొడతామని లంకల గన్నవరం లాకుకు చెందిన వీర మహిళలు మొక్కుకున్నారు. దీంతో సోమవారం వారంతా ప్రత్యేక వాహనంలో మురముళ్ల వెళ్లి వీరేశ్వరస్వామికి 108 కొబ్బరికాయలు కొట్టడంతో పాటు క్షీరాభిషేకం చేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, అంబటి కోటేశ్వరరావు, జనసైనికులు, వీర మహిళలు, లంకల గన్నవరం పవన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



గాడిలంకలో రూపుదిద్దుకుంటున్న

రామోజీరావు విగ్రహం

ముమ్మిడివరం, జూన్ 24: మండలంలోని గాడిలంకకు చెందిన ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి మాధవరావు ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహాన్ని రూపొందిస్తున్నా డు. తుది మెరుగులు దిద్ది త్వరలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేస్తానని మాధవరావు తెలిపారు.

బోడసకుర్రులో గ్రామ దేవతల తీర్థం

అల్లవరం, జూన్ 24: బోడసకుర్రులో గ్రామ దేవతలు మహంకాళమ్మ, ఘంటాలమ్మ ఆలయాల వద్ద తీర్థం జరిగింది. పిల్లాపాపలు సహా మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాల తనిఖీ

రాయవరం, జూన్ 24: మండలంలోని సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రామచంద్రపురం డీవైఈవో నరసింహ ఫణి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులను పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రవేశాలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. హెచ్ఎం దయామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

కె.గంగవరం, జూన్ 24: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం కె.గంగవరంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-1 ఎ.నాగరాజు, ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరావు, సీఆర్పీలు వెంకన్నబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా శారదాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



యానాం, జూన్ 24: స్థానిక గోపాల్ నగర్‌లోని శారదా దేవి అమ్మవారి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని కమిటీ ప్రతినిధులు, భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. పెనుపోతు భైరవస్వామి-నాగదేవి దంపతులు, వారి కుమార్తె సాయి శర్వాణి, కుమారుడు సత్యవెంకట శ్రీవర్మ గణపతి, సరస్వతీ హోమాలను శాస్త్రోక్తంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర

అంబాజీపేట, జూన్ 24: తొండవరం గ్రామ దేవత శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థం, 29న జలకం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

గోదావరినీ వదలని 'షెకావత్'


మైదాన మత్స్యకారులతో గిరిజన మత్స్యకారుల వాగ్వాదం

ఆయన జమానాలో నిర్వాసిత మత్స్యకార్ల హక్కులను అమ్మేసిన అటవీ అధికారులు

లంకలను అడ్డా చేసుకుని గోదావరి రెండు ఒడ్డుల మధ్య మత్స్య సంపద దోపిడీ

లైసెన్సులు ఉన్న నిర్వాసితులను అణచివేసి అంతర్రాష్ట్ర వేటగాళ్లకు ప్రోత్సాహం


వేటాడిన చేపలు

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం):
రంపచోడవరం అటవీ డివిజన్‌లో షెకావత్ అవతారమెత్తిన అటవీ అధికారి తన బృందం అక్రమాలకు అటవీ సంపదనే కాకుండా పాపికొండల అభయారణ్యంలోని గోదావరి పరివాహక ప్రాంతాన్నీ వదలలేదు. కాదేది అక్రమాలకు అనర్హం అన్న చందంగా గోదావరి పరివాహక ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే గ్రామాలు ఖాళీ కావడంతో అక్కడ అక్రమాలకు తెరతీశారు. గోదావరిలో మత్స్య సంపద వేట హక్కులను కలిగిన నిర్వాసిత గిరిజనులపై ఆంక్షలు విధించి అంతరాష్ట్ర మత్స్య వేటగాళ్లకు గోదావరిపై గిరిజనులకు ఉన్న హక్కులను అమ్మేశారు. వివరాల్లోకి వెళితే...పోలవరం నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల గిరిజన నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాస చర్యలలో భాగంగా గోదావరిలో చేపల వేట హక్కులను మంజూరు చేశారు. లైసెన్సులను కూడా అందించారు. నిర్వాసిత గిరిజనులు సంప్రదాయబద్ధంగా మత్స్య సంపద మనుగడ దెబ్బ తినకుండా వేట సాగించేవారు. క్రమం తప్పకుండా చేప పిల్లలను గోదావరిలో వదిలేవారు. ఈ చర్యలతో గోదావరిలో మత్స్య సంపద పెరగడంతో దళారీల కన్ను పడింది. దీంతో కొంతమంది దళారులు మైదాన ప్రాంతాల నుంచి మత్స్యకారులను రహస్యంగా గోదావరి అవతల ఒడ్డు నుంచి, కాఫర్ డ్యామ్ ద్వారా రప్పించి రహస్య వేట సాగించడం మొదలుపెట్టారు. రాను రాను ఇది గోదావరిలో మత్స్య సంపద దోపిడీ ముఠాగా మారింది. ఇది క్రమేణా గిరిజన నిర్వాసిత మత్స్యకారుల మనుగడను, గోదావరిలో మత్స్య సంపద మనుగడను దెబ్బతీసేలా పరిణమించింది. చేప పెరగకుండానే పిల్లలుగా ఉన్నప్పుడే వేటాడేస్తున్నారు. గోదావరిలో సాగుతున్న అంతరాష్ట్ర మత్స్యకారుల దోపిడీ వేటను నిరోధించాలని గిరిజన నిర్వాసితులు అటవీ అధికారులకు, పోలీసు అధికారులకు, ఐటీడీఏకు ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎన్ని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వ అండదండల కారణంగా ఎటువంటి చర్యలూ లేవు. మొక్కుబడిగా కొన్ని పడవలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయంలో ఉంచుకుని ఊరుకున్నారు. అంతేకాక ఈ దోపిడీని నిరోధించాల్సిన అటవీ శాఖ ఉన్నతాధికారులే దీనిని ప్రోత్సహించడం, ఈ దోపిడీని ఎదురించే గిరిజన మత్స్యకారులను ఇబ్బందులు పెట్టడం, పాపికొండల అభయారణ్యం పేరుతో గిరిజనులపైనే అటవీ చట్టాలను ప్రయోగించడం తదితర చర్యలతో గిరిజనుల అడ్డు లేకుండా చేసి తద్వారా పరోక్షంగా అక్రమ దందాకు వంత పాడుతున్నారు. అటవీశాఖాధికారులు, ఇతర సంబంధిత అధికారులు ఈ దోపిడీ వెనుక ఉన్న దళారీల ద్వారా లబ్ధిపొందుతూ వచ్చారు. అంతే కాకుండా గిరిజనుల ఆటోను స్వాధీనం చేసుకుని చలానా కట్టించుకుని, వారి వలలను స్వాధీన పర్చుకుని దళారీ వద్దనే ఉంచి గిరిజనులు వేటాడకుండా చేశారు. ఈ మొత్తం బాగోతం వెనుక ఇటీవల కాలంలో అటవీశాఖలో టేకు చెట్ల నరికివేతతో పాటు పలు అక్రమాలను ప్రోత్సహించిన ఓ ఉన్నతాధికారే ఉండటం ఎవరినీ ఆశ్చర్యపర్చడం లేదు. కాగా ఊహించని రీతిలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం ఈ అక్రమార్కులకు, వారిని ప్రోత్సహించే అధికారులకు మింగుడుపడనిదిగా మారింది. దీంతో కొత్త పాలన, కొత్త అధికారుల రాకతో గిరిజన నిర్వాసితులలో కూడా ఈ అక్రమార్కుల పీడ వదిలిపోతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.


అటవీ శాఖ స్వాధీనంలో ఉన్న పడవలు

ఆరు రైళ్లు యథాతథం

రద్దైన రైళ్ల జాబితా నుంచి మినహాయింపు



రాజమహేంద్రవరం,(ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, జూన్ 24:
కడియం-నిడదవోలు రైల్వే లైన్ల మధ్య మరమ్మతు పనుల నిమిత్తం మొత్తం 26 రైళ్లను సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడగా ప్రయాణికుల ఆగ్రహంతో రైల్వేశాఖ వెనక్కి తగ్గింది. కొన్ని రైళ్లకు రద్దు జాబితా నుంచి మినహాయింపు ఇచ్చింది. మొత్తం ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నట్లు రైల్వే పీఆర్వో (విజయవాడ) నస్రత్ మండ్రూప్‌కర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

12805 నంబరు గల విశాఖ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ముందుగా చేసిన ప్రకటన మేరకు ఈ నెల 23 నుంచి 10 ఆగస్టు వరకూ, తిరిగి 16 సెప్టెంబరు నుంచి 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా సోమవారం రాత్రి అందిన ఉత్తర్వులు మేరకు ఈ నెల 25 మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు. ఇదే రీతిలో రద్దు అయిన 12806 నంబరు గల లింగంపల్లి-విశాఖల మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఈ నెల 26 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు.

17643 నంబరు గల చెంగల్పట్టు-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ గతంలో ప్రకటించిన విధంగా 10 ఆగస్టు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. ఇదే రీతిలో 17644 నంబరు గల కాకినాడ-చెంగల్పట్టు మధ్య రాకపోకలు సాగించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ నెల 25 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని పేర్కొన్నారు.

17258 నంబరు గల కాకినాడ-విజయవాడల మధ్య రాకపోకలు సాగించే రైలు ముందుగా ప్రకటించిన మేరకు 15 అక్టోబరు వరకూ రద్దు చేయగా తాజాగా అందిన ఆదేశాల మేరకు మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంది. అలాగే 17257 నంబరు గల విజయవాడ-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే రైలు కూడా మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తుందని ప్రయాణికులు గమనించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి 15 ఏళ్ల జైలు

అమలాపురం టౌన్, జూన్ 24: బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసిన వ్యక్తికి కాకినాడ పోక్సో కోర్టు 15 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేలు జరిమానా విధించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో దళిత బాలికకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెళ్ల గణపతి అనే వ్యక్తి మత్తు పానీయాలు ఇచ్చి బలవంతంగా అనుభవించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది రోజులకే బాలిక గర్భవతి కాగా గుర్తించిన తల్లిదండ్రులు 2018 ఏప్రిల్ 2న గణపతిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. స్పెషల్ కోర్టు ఫర్ స్పీడీ ట్రయల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ పోక్సో యాక్టు-2012 కాకినాడ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ట్రయల్ నిర్వహించి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో కరెళ్ల గణపతికి శిక్ష విధిస్తూ జడ్జి కె.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ జి.సురేంద్ర, దర్యాప్తు అధికారి ఎం.వెంకటేశ్వరరావును ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

యువతి తన ప్రేమను అర్థం చేసుకోలేదని యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, జూన్ 24: తన ప్రేమను అర్థం చేసుకోకుండా తనపై ఓ యువతి తరపున పోలీసు కేసు పెట్టడాన్ని జీర్ణించుకోలేని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇందిరానగర్‌కు చెందిన బండి చక్రధొర(26) ఓ యువతిని 2021లో ప్రేమించాడు. దీంతో యువతి హైదరాబాద్ వెళ్లిపోయింది. యువతి అక్కడ నుంచి ఇటీవల ఇందిరానగర్ పరీక్షలు రాయడానికి వచ్చింది. మళ్లీ తన కూతురి దగ్గరకు చక్రదొర వస్తాడనే అనుమానంతో యువతి తల్లి కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన చక్రదొర ఇంట్లోనే ఆత్మహత్య చేసుకొన్నాడని పోలీసులు తెలిపారు. యువకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిషేధిత సిగరెట్ ప్యాకెట్లపై విజి'లెన్స్'

రూ.16.41లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్లు

అమలాపురం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రధానంగా మూడు దుకాణాలపై దాడులు జరిపి రూ.16,41,530 విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులపై మూడు కేసులు నమోదు చేసినట్టు రీజనల్ విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం బైపాస్ రోడ్డు రామకృష్ణ వీధిలోని ఎంఎస్ నిషిక ఎంటర్‌ప్రైజెస్‌పై తొలుత దాడులు జరిపారు. ఏడు బ్రాండ్లకు సంబంధించి నిషేధిత సిగరెట్లను గుర్తించి రూ.14,33,600 విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు కోసం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన నున్న వెంకట బుచ్చిరాజు గుంటూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి నిషేధిత సిగరెట్లను సేకరించి తన అల్లుడైన ఎస్వీఆర్ఎస్ఎస్ శోభిత్ ద్వారా ఎంఎస్ నిషిక ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్ విక్రయాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. సిగరెట్ ప్యాకెట్లపై చట్టబద్ధమైన వివరాలను ప్రకటించనందున లీగల్ మెట్రాలజీ అధికారులు ఎల్ఎం యాక్టు-2009 కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఎర్రమిల్లి వారి వీధిలోని ఎంఎస్ వరలక్ష్మి జనరల్ మర్చంట్స్‌ను తనిఖీ చేయగా నిషేధిత సిగరెట్ ప్యాకెట్లయిన హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్ తదితర 2,080 ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.1,09,200గా నిర్ధారించారు. షాపు యజమాని జీఎస్టీ సైతం నమోదు చేసుకోలేదు. స్టాకుకు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల బిల్లులు నిర్వహించట్లేదని జీఎస్టీ అధికారులు గుర్తించారు. అనంతరం అదే వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు జరిపి రూ.1,98,730 విలువైన 3,873 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా షాపుల యజమానులపై కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పి.ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగవెంకటరాజు, భార్గవమహేష్, లక్ష్మీనారాయణ, నవీన్‌కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు, కిశోర్ పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు

ఈనెల 27 వరకు నిర్వహణ
జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు సమీక్ష

జేఎన్టీయూకేలో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

జేఎన్టీయూకే, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీఆర్‌సెట్) 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా ఈఈఈ,ఈసీఈ విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు వర్సిటీ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయని, ఈనెల 27 వరకూ కొనసాగుతాయని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ సమావేశ హాల్లో పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో వీసీ పాల్గొని బీఓఎస్ చైర్మన్‌లు, విభాగాధిపతులు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ సభ్యులతో ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్, రోస్టర్ పాయింట్స్ ప్రాతిపదికన 2023-24 విద్యాసంవత్సరానికిగాను పీహెచ్‌డీ కోసం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈఈఈ విభాగానికి 225 మందికి మూడురోజులపాటు, ఈసీఈ విభాగానికి 364 మందికి నాలుగు రోజుల పాటు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈఈఈ విభాగానికి సంబంధించి సోమవారం 75 మందికి, ఈసీఈ విభాగానికి సంబంధించి 90 మందికి అడ్మిషన్స్, పరిశోధనాభివృద్ధి డైరెక్టరేట్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ (డీఏఏ) సీహెచ్ సాయిబాబు, ఐక్యూ ఏసీ డైరెక్టర్ ఎన్.బాలాజీ, డీఏపీ వెంకటరెడ్డి, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పాల్గొన్నారు.

వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు


చామర్తి కన్నబాబు, సవితాల వీరబాబు, మెకరాల రాజేష్

అన్నవరం, జూన్ 26: అన్నవరం దేవస్థానం వ్రతపురోహితసంఘ ఎన్నికలు సోమవారం సాయంత్రం రత్నగిరిపై జరగగా కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చామర్తి కన్నబాబు ఎన్నికయ్యారు. సుమారు 30 సంవత్సరాలుగా వ్రత పురోహితుడిగా వివిధ గ్రేడ్‌లలో సేవలందించడంతో పాటుగా ప్రస్తుతం దేవస్థానం కల్యాణబ్రహ్మగాను గతంలో 2017-18 లో వ్రత పురోహిత సంఘ అధ్యక్షుడిగా కన్నబాబు వ్యవహరించారు. 2022-23లో దేవస్థానం వైదిక కమిటీలో పనిచేశారు. కార్యదర్శిగా సవితాల వీరబాబు, కోశాధికారిగా మొకరాల రాజేష్‌ను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వ్రత పురోహితుల సమస్యలు పరిష్కరించడంతో పాటుగా పదవీ విరమణ పొందిన పురోహితులకు, వారి కుటుంబ సభ్యులకు అందించే సౌకర్యాలను సకాలంలో అందేలా చూస్తానని చెప్పారు.


పాదాలమ్మ తల్లి



2 వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగునీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు



సామర్లకోట, జూన్ 24: సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామికి సోమవారం పంచద్రవ్యాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించగా ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులు అన్నదానం స్వీకరించారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

దివాన్‌చెరువు, జూన్ 24: ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన వారికి జియాలజీ, మేనేజ్మెంట్ విభాగాల్లో ప్రవేశాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ ప్రక్రియను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జియాలజీ, విభాగంలో 30 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా మేనేజ్మెంట్ విభాగంలో 320 మందికి గాను 80 మందికి జరిగాయన్నారు. మిగిలిన వారికి ఈ నెల 27వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు సెట్ కన్వీనర్ సూచనల ప్రకారం సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జియాలజీ, మేనేజ్మెంట్ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 38 అర్జీలు

వివిధ సమస్యలపై అర్జీలు అందించిన ప్రజలు

త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని పీవో ఆదేశాలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఇతర అధికారులు

రంపచోడవరం, జూన్ 24: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం కార్యక్రమంలో సుమారు 38 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి పీవో అర్జీలను స్వీకరించారు. దేవీపట్నం మండలం తున్నూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, మారేడుమిల్లి మండలం వైదపూడిలో పాఠశాల భవనం నిర్మించాలని, తాడేపల్లి-సద్దిరేవుల వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టు తొయ్యేరులోని 18 ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, వికలాంగుల పింఛను మంజూరు చేయాలని, నేషనల్ హైవేలో స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ వచ్చిన అర్జీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించాలన్నారు. ప్రతి అర్జీ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, పశుసంవర్ధకశాఖ డీడీ షరీఫ్, డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఎల్‌పీవో రాఘవన్, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాదాలమ్మ తల్లికి తిరుప్పావడ సేవ

గొల్లప్రోలు, జూన్ 24: కాకినాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద కొలువయి ఉన్న పాదాలమ్మ తల్లికి సోమవారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. గ్రామదేవతా విరాజిల్లుతున్న పాదాలమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ సేవ జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

❍ **చివరి తేదీ:** జూలై 9

❍ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

(నిన్నటి దిక్సూచి తరువాయి)

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయి ల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రెయిన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yknNzixలో చదవండి.





పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

\- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్ట్‌లో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్స్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల




క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చి పెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2czlCy9 లో చదవండి.